# కర్మ మరియు కృప

" దేవునియందు భయభక్తులుగలవారలారా, మీరందరు వచ్చి ఆలకించుడి. ఆయన నా కొరకు చేసిన కార్యములను నేను వినిపించెదను." (కీర్తన ౬౬:16)

నేను హిందూ ఉన్నత కులమైన క్షత్రియ (యుద్ధ వీరుడు మరియు ప్రభుత్వములో పనిచేయు ఉన్నత మధ్య తరగతి) కుటుంబములో ఈనాటి బంగ్లాదేశ్‌కు చెందిన దక్షిణ ప్రాంతములో 1952వ సంవత్సరములో జన్మించితిని. కాని, 1973వ సంవత్సరములో తిరిగి జన్మించితిని. నేను మీతో పంచుకోవాలనుకొనే నా కథ ఇది. నా కుటుంబము చాల సాంప్రదాయకమైనది మరియు నా చిన్నతనమునుండి నా కుటుంబ ఆచారమును మరియు సంఘములో మాకున్న హోదాను నిలబెట్టవలసినదిగా చాల ఖచ్చితముగా ఆదేశించబడితిని. నేను ప్రాథమిక పాఠశాలలోనున్నప్పుడు, మత సంబంధమైన బాధ్యతను అనుదినము నెరవేర్చవలెనని నా తాతగారిచేత ఆదేశించబడితిని. అప్పటినుండి నేను వేదములను, ఉపనిషత్తులను, భగవత్ గీత మరియు అన్ని ఇతర హిందూ శాస్త్రములను నా తాతగారి సలహాల మేరకు చదువ నారంభించితిని. మానవుని రక్షణ కర్మ(కారణఫలితములు లేక పనులు) మీద ఆధారపడియుండునని నేను తెలిసికొంటిని. రక్షణ మంచి పనులు చేయుట ద్వారా సంపాదించుకొనవలెను. ఎవ్వరును అతనికిలేక ఆమెకుగల ఒక్క జన్మలో మంచి పనులు చేయలేరు కనుక, క్రమముగా ప్రతియొక్కరు సంసార (పునర్జన్మ అనే చక్రము) ద్వారా పోవలసియున్నది. ఇది పాపపరిహారమునిచ్చినట్లు అవుతుంది. చివరికి ఒక రోజున మోక్ష(రక్షణ) అని వారు పిలిచే బ్రహ్మ (సృష్టికర్తయైన దేవుడు)లో వారి ఆత్మలు లీనమైపోవును. ఈ పునర్జన్మ చక్రములో ప్రతిసారి మానవ శరీరముగా అవతరించుటకు గ్యారంటీ లేదు. పక్షులుగాను మరియు పలువిధములైన జంతువులుగాను అయ్యే అవకాశమున్నది. అది ఒకని కర్మమీద ఆధారపడి ఉంటుంది. ఈ పునర్జన్మ చక్రవిధానములో నా తరువాతి జన్మలో నేను ఏదో రకమైన జంతువుగా జన్మనిస్తానేమో అనే భయము నా మనసులో పెరిగెను. ఎన్ని అవతారములెత్తినాక నేను రక్షించబడుతాను? అనే ప్రశ్న నా హృదయములోనుండెను. నేను నా తాతగారిని మరియు ఇతర హిందూ

పండితులను అడిగితినిగాని ఎవ్వరును నాకు తృప్తికరమైన సమాధానమును ఇవ్వలేదు. నన్నునేను ప్రశ్నించుకొనుటకారంభించితిని. ఖైదీలకు కూడా వారు ఖైదులో ఉండే సమయము వారికి తెలియును. కాని, పునర్జన్మ చక్రము ద్వారా ఎన్నిసార్లు నేను జన్మించవలెనో నాకు అస్సలు తెలియదు. దాదాపు ప్రతి సంవత్సరము నేను నా తాతవ్వలతో భారతదేశములోని వివిధ స్థలములలోగల ప్రసిద్ధ హిందూ పుణ్య స్థలములను దర్శించితిని. నేను వెళ్ళిన ప్రతిసారి పునర్జన్మ చక్రమునుగూర్చి మరియు రక్షణ (మోక్షము) కొరకైన నిశ్చయతకు సమయమును గురించి అనేకమంది హిందూ పండితులతో మాట్లాడితిని. పునర్జన్మ చక్రమునుగూర్చి నాకేమి సమస్యలేదు కాని ఎన్ని జన్మలెత్తిన తర్వాత నా ఆత్మ బ్రహ్మ(సృష్టికర్తయైన దేవుడు)లో లీనమైపోతుంది అనే ఖచ్చితమైన నిశ్చయతను కలిగియుండాలని కోరుకొంటిని. ఈ దినమువరకు నా కుటుంబములో కుల వ్యవస్థను ఖచ్చితముగా పాటించుదురు. నేను ఈ వ్యవస్థలో పెరిగితిని. దినములు జరుగుకొలది నా స్వంత హిందూ సమాజములో తక్కువ కులానికిచెందిన నా మనుష్యులు మా గృహములోపలికి వచ్చుటకు అనుమతించని ఆచారమును నా కుటుంబములో చూచితిని. వారు కలిసికొనుటకు ప్రత్యేకమైన స్థలములుండినవి మరియు వారు అంటరానివారుగా వ్యవహరించ బడెడివారు. అది నాకు విచారమును కలిగించినది. కాని దీనిని వ్యతిరేకించుటకు నాకు మార్గమేమియూ లేదు. నా తాతగారినుండి నేను తెలిసికొనినదేమనగా నేను ఉన్నత కులములో పుట్టుటకు ఉద్దేశించబడితిని మరియు ఈ వ్యవస్థ అంతయు దేవునిచేత స్థాపించబడినది. సర్వజీవులయొక్క సృష్టికర్త బ్రహ్మ అయితే, ఈ విధమైన తారతమ్యమును చూపుటకు ఆయన ఎటువంటి సృష్టికర్త అని నా మనసులో ప్రశ్నించుటకారంభించితిని. బ్రాహ్మణుల(పూజారుల కులము) తర్వాత ఉన్నత కులములో నేను పుట్టినప్పటికిని, ఈ క్రూరమైన వ్యవస్థకు అలవాటుపడుటకు నాకు చాల కష్టముగానుండెను. వివిధ మతములగురించి మరియు వాటిని గురించిన లోకదృక్పథములను గురించి నా తాతగారితో మంచి సంభాషణలు కలిగియుంటిమి. ఒక రోజున నేను ఆయనను క్రైస్తవ్యమును గూర్చి అడిగితిని, కాని ఆయన నేను మరచిపోలేని ఒక నిర్వచనమును చెప్పెను. ఆయన ప్రకారము క్రైస్తవులు పంది మరియు ఎద్దు మాంసమును తిందురు కనుక చాల ఎక్కువ అపవిత్రులు. ఆయన ఇచ్చిన నిర్వచనము ముఖ్యముగా

ఆహార సంబంధమైన నియమాలమీద ఆధారపడియున్నది. క్రైస్తవ్యము అంటరాని ప్రజల విదేశీమతము. వారు నీచ కులానికి చెందిన హిందూ ప్రజలకంటె ఇంకా ఎక్కువ అంటరానివారుగా వ్యవహరించబడిరి.

1971వ సంవత్సరములో లిబరేషన్ యుద్ధమయ్యేటప్పుడు, నేను నా కుటుంబముతో భారతదేశానికి శరణార్థిగా వెళ్ళితిని. శరణార్థుల క్యాంపునందు ఉంటిమి. దినములు జరిగేకొలది వివిధ ధాతృత్వ సంస్థలనుండి క్రైస్తవులు శరణార్థ అనాథ ప్రజలకు సేవచేయుటను చూచితిమి. వారి సమర్పణను చూచి నేనెంతో ఆకర్షించబడ్డాను. వారిలో కొంతమందితో నేను స్నేహముచేసితిని. వారు దేవుని కృపచేతనే రక్షించబడినందున ఈ మంచి పనులు చేయుచున్నారని క్రైస్తవ మెడికల్ టీమ్‌కు చెందిన వారిలో ఒకరు ఒక రోజున నాతో చెప్పెను. వారు రక్షణను సంపాదించుకొనుటకు ఈ మంచి పనులు చేయుటలేదు. వారి దేవుడు ప్రేమమైయున్నాడు మరియు ఆయన ప్రేమ యేసు అనే వ్యక్తిలో బయలుపరచబడియున్నది. ఆ వ్యక్తి ఇంకను, " నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము." అని యేసు చెప్పెనని అనెను. ఏ మతానికి, ఏకులానికి చెందినవారైననూ యేసుయొక్క ఈ బోధ ప్రజలందరికి సేవచేయుటకు వారిని నడిపించినది. ఈ ఆలోచన దేవునిగూర్చి మరియు ఆయన వ్యక్తిత్వమును గూర్చిన నా పరిపూర్ణ అవగాహనను మార్చివేసినది. అప్పుడే నేను యేసును గూర్చి మొదటిసారిగా వింటిని.

1972వ సంవత్సరములో మేము విడుదలచేయబడిన తర్వాత, అందరము మా దేశమునకు తిరిగి వచ్చితిమి. మేము మా ఆస్థిలో ఎంతో భాగమును పోగొట్టుకొంటిమి. అది ఒక సామూహిక హత్య. ఒక రోజున నేను నా స్వస్థలములో ఒక రోడ్డుమీద తిరుగుచుంటిని. అనుకొనని రీతిగా నేనొక పేరుగల్గిన చిన్న బోర్డును చూచితిని. దాని మీద "ప్రపంచ మిషనరీ పొవార్తీకరణ"అని వ్రాయబడియుండెను. ఎంతో ఆసక్తితో నేను లోపలికి ప్రవేశించి చివరికి ఆ సంస్థయొక్క డైరెక్టర్‌ను కలిసికొంటిని. ఆ వ్యక్తి నన్ను కౌగలించుకొని " దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు, నేనునూ నిన్ను ప్రేమించుచున్నాను" అనే ఆయన మాటలు నన్నెంతో ఆకర్షించినవి. ఆయనతో నేను చక్కని సంభాషణను

కలిగియుంటిని మరియు మా సంభాషణలో కొన్నిసార్లు వాదనలుకూడా ఉండినవి. కాని ఆ వ్యక్తి నాతో ఎంతో ఓపికతో మాట్లాడి నా ప్రశ్నలకు జవాబిచ్చుటకు తన శాయశక్తులా ప్రయత్నించాడు. నేను ఆయనతో ఎన్నో సమావేశములు జరిపితిని మరియు ఆయన నాతో యేసును గూర్చి చెప్పెను. ఆయన నాకు ఒక క్రొత్త నిబంధనను ఇచ్చి చాల జాగ్రత్తగా చదువుమని చెప్పెను. ఎంతో గొప్ప ఆసక్తితో నేను ఆ క్రొత్త నిబంధనను నా తలగడ క్రింద దాచిపెట్టుకొని మధ్య రాత్రులలో కూడా చదువుచుంటిని. నా హిందూమత పవిత్ర గ్రంథములన్నిటితో పోల్చి చూస్తే ఈ గ్రంథము చాల చిన్నదిగానుండెను. రెండు నెలలలో నేను దానిని పూర్తిచేయగలిగితిని కాని ఆ గ్రంథమునంతయు కనీసము పదిమారులు చదువవలెనని సలహానిచ్చిరి.

ఒక రోజున నేను రోమీయులకు వ్రాసిన పత్రిక 6వ అధ్యాయము 23వ వచనమును చదువుచుంటిని. అది నా హృదయముతో మాట్లాడినది " ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము." - ఈ ప్రత్యేకమైన వచనము ద్వారా నిత్యజీవమనేది ఉచితముగా ఇవ్వబడే వరమని నేను తెలిసికొంటిని. దానిని అంగీకరించవలసియున్నది. అది నా జీవితములో ఒక మలుపు. హిందువునిగా నాకు నిత్య జీవమంటే బ్రహ్మలో లీనమైపోవుట మరియు దానిని ఎన్నో సంవత్సరాలుగా వేచియుండే చాల పెద్ద విధానమైన పునర్జన్మ చక్రము ద్వారా నేను దానిని సంపాదించాలి. బెంగాలీ భాషలో ఉన్న బైబిలు నా ప్రశ్నకు జవాబిచ్చినది. " అనుకూల సమయమందు నీ మొర నాలకించితిని; రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడు గదా! ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము." (2 కొరింథీ. 6:2). నేను ఆ జవాబు కొరకు వేచియుంటిని. నేను మరల యోహాను సువార్తను చదివి యేసు క్రీస్తు అనే వ్యక్తిలో దేవుని అవతారము పూర్తిగా సంపూర్ణమైనదని మరియు యేసు సిలువలో ఆయన ప్రాయశ్చిత్తము చేసే మరణము ద్వారా నా పాపవిమోచన క్రయధనమును చెల్లించినాడనే నిర్ణయానికి నేను వచ్చితిని. త్వరలోనే నేను పాపినని కనుగొన్నాను. నా మంచి పనులేమియూ నన్ను పవిత్రునిగా చేయలేకపోయినవి. నాయంతటనేను నా

పాపమునకు విమోచనా క్రయధనమును చెల్లించలేకపోతిని. మంచి పనులుచేయుట నాకు ఏ నిశ్చయతను ఇవ్వలేకపోయినది. నేను నా పాపములకై పశ్చాత్తాపపడితిని మరియు నన్నునేను యేసుకు సమర్పించుకొంటిని.

నేను 1973వ సంవత్సరము జూలై 20వ తారీఖున యేసును నా ప్రభువుగాను, రక్షకునిగాను అంగీకరించితిని. నా హృదయములో నిజమైన ఆనందము మరియు సమాధానమును పొందితిని ఎందుకనగా యేసు నిత్యజీవము కొరకై పూర్తి హామీని ఇచ్చెను. నా భయము మటుమాయమైపోయినది. ఒక నెల అయిన తర్వాత ఈ నూతన యనుభవమును నా కుటుంబ సభ్యులతో పంచుకొనుట కారంభించితిని. మొదట వారు నేనొక పిచ్చివాడనని అనుకొనిరి. దేవుని కృపతో నేను నింపబడితిని. కాని నేను యేసును గూర్చి పంచుకొని ఆయన వాగ్దానములన్నిటితో వారిని సవాలు చేసినప్పుడు నేను క్రైస్తవుడనైయ్యానని వారు తెలిసికొనిరి. త్వరలోనే నా తండ్రిచేత పిలువబడితిని. కాని నేను ధైర్యముగా ఆయన ప్రశ్నలన్నిటికి జవాబులిచ్చితిని. క్రైస్తవుడనైతే ఏమి నష్టపోతానో దాని గురించి ఆయన నన్ను హెచ్చరించాడు కాని నేను దానికి సిద్ధపడితిని. నా సహోదర సహోదరీలలో నేను పెద్దవాడిని. తరువాత కొన్ని నెలలవరకు నేను హింసలగుండా వెళ్ళవలసివచ్చినది - కొన్ని సార్లు శారీరక హింసకూడా - చివరికి నా తండ్రి నన్ను కాదని, కొట్టి ఇంటిబయటికి తరిమెను. నా జీవితములో అది నాకు అన్నిటికంటె కష్టతరమైన ఘట్టము. ఏ క్రైస్తవుడుకూడా నాకు ఆశ్రయమిచ్చుటకు సాహసించలేదు. నా స్వస్థలంలో బాప్టిస్ట్ చర్చియొక్క పాస్టర్ నాకు బాప్తిస్మమిచ్చుటకు చాల సార్లు నిరాకరించినాడు ఎందుకనగా మా ప్రాంతములో గొప్ప ప్రభావమును కల్గిన నా తండ్రిగారికి భయపడినాడు.

చివరికి నేను బాప్తిస్మము తీసికోగలిగాను మరియు యేసులోని నా విశ్వాసమును బాహాటముగా వ్యక్తపరచితిని. దాదాపు ఐదు సంవత్సరములవరకు నేను నా కుటుంబ సభ్యులనుండి అన్నిరకాల బెదరింపులను ఎదుర్కొనుచునేయుంటిని. ఈ సంవత్సరములన్నియు నాకు అలవాటులేని కష్టతరమైన పరిస్థితిలగుండా వెళ్ళవలసి వచ్చినది. చాల పర్యాయములు నా జీవితము ప్రమాదములో నుండెను. కాని ప్రతిసారి నా యేసుప్రభువు నన్ను పచ్చికబయళ్ళలో

పరుండజేయుచూ కాపాడెను. ఆయన శుభవార్తను నా స్వంత ప్రజలతో పంచుకొనుటకు నా జీవితములో ఆయన నిజమైన పిలుపును కలిగియున్నాను. ఎనిమిది సంవత్సరాల తర్వాత నా తండ్రి నా దగ్గరికి వచ్చెను మరియు మేమిద్దరము సమాధానపడితిమి. అప్పటినుండి నేను నా తండ్రి ఇంటికి వెళ్ళి నా తల్లిని, సహోదర సహోదరీలను దర్శించుటకు అనుమతించబడితిని. కాని ప్రతిసారి నేను వారిని దర్శించినపుడు నాకు సరియైన మర్యాదలు జరుగలేదు. నా తల్లి నన్ను సరిగా కౌగలించుకొనలేకపోయినది ఎందుకంటె నేను వారికి వెలివేయబడినవాడను. ఈ దినమువరకు నా కుటుంబమంతయు చీకటిలోనే ఉన్నారు. వారు మంచి పనులు(కర్మ) చేయుటకు వారి శక్తికొలది ప్రయత్నించుచున్నారు కాని వారి రక్షణ దినముకొరకైన గ్యారంటీ(హామి) వారికి లేదు.

నేను నా మంచి పనులద్వారా కాక యేసు క్రీస్తునందలి కృపచేతనే రక్షించబడితిని. గడచిన ముప్పది సంవత్సరాలనుండి నేను దేవుని రక్షించే ఈ కృపనుగూర్చి తెలియని వారితో పంచుకొనుచున్నాను మరియు నా జీవితాంతమువరకు ఈ విధంగానే చేయుచుందును. ఎవరైతే మంచి కర్మ ద్వారా రక్షణను పొందవలెనని తమ శక్తికొలది ప్రయత్నించుచున్నారో వారు రక్షించే ఈ కృపను గూర్చి తెలిసికోవలెనని నా ప్రార్థన. దేవుడు వారి హృదయాలను తెరచి వారిని చీకటిలోనుండి వెలుగులోనికి నడిపించునుగాక.